రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చొక్కాకుమారి

రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చొక్కాకుమారి, ఉపాధి హామీ కార్మికులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు-సవాళ్లు' అనే అంశంపై నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సులో ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కాకుమారి పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికులతో కలిసి సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొలతలు లేని పనికి కొలతలు పెట్టి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కొలతలను రద్దు చేసి రోజుకు ఆరు గంటల పనికి రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు కళమ్మ, సుజాత, పోచమ్మ, రాములమ్మ, ధనలక్ష్మి, సత్తెమ్మ, స్వరూప, మంగమ్మ, పద్మ, సుజాత, రేణుక, చంద్రకళ, కలమ్మ, పద్మ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

● ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి

బడిబాట కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు

బీబీనగర్, జూన్ 6 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండలంలోని చిన్నరావులపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆల్వ భాస్కర్‌రెడ్డి కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం పాఠశాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. బడీడు పిల్లలు, బడి మానేసిన పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వం పిల్లలకు ఉచిత దుస్తులు, పుస్తకాలు అందజేస్తుందన్నారు. అనంతరం బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆండాలు, ఉపాధ్యాయులు పద్మావతి, సరిత, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

● ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్

మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్

బొమ్మలరామారం, జూన్ 6 : ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చైర్మన్లు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్ సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్లకు బడిబాట నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభం నాటికి పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్లు పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా, నాణ్యత ప్రామాణాలు పాటించేలా పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల్లోని సౌకర్యాలు, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాల గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రోజారాణి, జీహెచ్‌ఎంలు వరలక్ష్మి, ఉపేంద్ర, లక్ష్మి, సీఆర్‌పీలు శ్రీహరి, విశ్వరూపం, జహంగీర్, మిస్ కో ఆర్డినేటర్ శిరీష, ఎల్‌డీఏ ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్పతత్వాన్ని కించపరిచే వారిపై పోరాడాలి

● తెలంగాణ అయ్యప్ప జేఏసీ

సమావేశంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : శబరిమలలో అయ్యప్పస్వాములకు జరుగుతున్న ఇబ్బందులు, సమస్యలతోపాటు అయ్యప్పతత్వాన్ని కించపరిచే వారిపై పోరాడాలని తెలంగాణ అయ్యప్ప జేఏసీ సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. గురువారం మండలంలోని వడాయిగూడెం పరిధిలోని వైఎల్ఎన్ఎస్ వాసవి నిత్యాన్నదాన సత్రంలో నిర్వహించిన తెలంగాణ అయ్యప్ప ఐక్యవేదిక ముఖ్య గురుస్వాముల సమావేశంలో వారు మాట్లాడారు. శబరిమలలో అయ్యప్ప స్వాములకు జరుగుతున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. కేరళ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అయ్యప్ప స్వామి దర్శనానికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ అయ్యప్ప జేఏసీ నాయకులు నాయని బుచ్చిరెడ్డి, రాధాకృష్ణ, ప్రేమ్‌గాంధీ, పెండెం శ్రీనివాస్, వైఎల్ఎన్ఎస్ వాసవి నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు అయిత రాములు, కోశాధికారి చీల విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు.

21న పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

● ఎన్నికల అధికారి శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 6 : ఈ నెల 21న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార ఆడిటర్, ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక పోచంపల్లి బ్యాంక్‌లో ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 నుంచి 13 వరకు నామినేషన్ల స్వీకరణ, 14న నామినేషన్ల పరిశీలన, 15న ఉప సంహరణ, సాయంత్రం గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. 21న కృష్ణవేణి పాఠశాలలో మధ్యాహ్నం 3 నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. కాగా, 9 మంది డైరెక్టర్లకు గానూ ఇద్దరు మహిళలు, ఒకరు ఎస్సీ, జనరల్ కేటగిరీలో ఆరుగురు పోటీ చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, సభ్యులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ సీత శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూరెళ్ల పాల సంఘం చైర్మన్‌గా పిచ్చిరెడ్డి

ఆత్మకూరు(ఎం), జూన్ 6 : మండలంలోని కూరెళ్ల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పాల సంఘం నూతన చైర్మన్‌గా మోతె పిచ్చిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, బాషబోయిన కేతమ్మను ఎన్నుకున్నారు. సమావేశంలో పాడి రైతులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో సుదర్శన నారసింహ హోమం

స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ వైభవంగా సాగింది. ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు జరిపించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు జరిగాయి. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. సుమారు 13 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.27,84,759 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కొమ్మ కొమ్మకో కొంగ..

రాజాపేట మండలం జాల గ్రామ శివారులో ఓ తుమ్మ చెట్టుపై కొంగలు గూళ్లు ఏర్పాటు చేసుకొని రాత్రిపూట సేద తీరుతున్నాయి. పచ్చని చెట్టుకు తెల్లని పూలలా కొంగలు దర్శనమిస్తూ కనువిందు చేస్తున్నాయి.
–రాజాపేట, జూన్ 6

కమలమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి నివాళి

రామన్నపేట, జూన్ 6 : మండలంలోని సిరిపురం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి బండ కమలమ్మ బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, ఎంపీటీసీ వేమవరపు సుధీర్‌బాబు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, కంభంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, పున్న వెంకటేశం, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కూనూరు ముత్తయ్య ఉన్నారు.

బీపీఎంను సస్పెండ్ చేయాలని ఉపాధి హామీ కూలీల ధర్నా

రాయిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఆత్మకూరు(ఎం), జూన్ 6 : ఫోర్జరీ సంతకాలతో ఉపాధి హామీ కూలీల డబ్బులు స్వాహా చేసిన బీపీఎంను సస్పెండ్ చేయాలని కోరుతూ.. గురువారం మండలంలోని రాయిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉపాధి హామీ కూలీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ... గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు వేతనాలు ఇవ్వకుండా బీపీఎం ఫోర్జరీ సంతకాలతో సుమారు గ్రామంలోని 25 మంది కూలీలకు చెందిన రూ.1.60లక్షలు డ్రా చేసి మోసం చేశారని ఆరోపించారు. రెండ్రోజుల క్రితం ఉపాధి హామీ కూలీకి సంబంధించిన డబ్బులు డ్రా చేసినట్లు తమ సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఆశ్చర్యపోయి సంబంధిత తపాలా అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. కూలీల వేతనాలను డ్రా చేసిన బీపీఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూలీలు నర్మద, సత్తెమ్మ, రమణమ్మ, లింగమ్మ, లక్ష్మి, ఐలమ్మ, భవాని, మల్లేశం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

చెరువు సింగారానిది.. సొసైటీ చాడది

● చేపల కోసం ఇరు గ్రామాల ప్రజల పోటాపోటీ

● పోలీస్‌ల పహారాలో చేపల వేట

చెరువు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు(ఎం), జూన్ 6 : మండలంలోని సింగారం బండ చెరువులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేప పిల్లలను వదిలింది. చెరువు సింగారంలో ఉన్నప్పటికీ మోట కొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో ఉన్నది. దాంతో నెల రోజుల క్రితం చేపలు పట్టేందుకు చాడ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు వెళ్లగా.. గ్రామస్తులు అడ్డుపడడంతో ఘర్షణ నెలకొంది. మా ఊరి చెరువులోని చేపలను మేమే పట్టుకుంటామని, సొసైటీ సభ్యులు రావద్దని గ్రామస్తులు అడ్డుకున్నారు. 1975 నుంచి చాడ సొసైటీ పరిధిలో చెరువు ఉండడంతో పూర్తి హక్కులు తమకే ఉన్నాయని సొసైటీ సభ్యులు వాదించారు. సింగారం గ్రామాభివృద్ధికి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో సొసైటీ సభ్యులు జిల్లా మత్స్యశాఖ అధికారికి ఫిర్యాదు చేయగా, డీసీపీ ఆదేశాల మేరకు గురువారం చాడ సొసైటీ సభ్యులు చేపలు పట్టుకునేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని గ్రామాభివృద్ధి కోసం సొసైటీ సభ్యులు రూ.1.60 లక్షలు ఇచ్చేలా ఒప్పించి శాంతింపజేశారు. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పేకాటగాళ్ల అరెస్ట్

చౌటుప్పల్, జూన్ 6 : మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారంలో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. దాడిలో 8 మంది పేకాటగాళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ.78వేల నగదు, 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వాలెపు శ్రీను, కుంచాలి శ్రీను, పేరం బ్రహ్మయ్య, తానేరు ఆదినారాయణ, తానేరు నర్సింహారావు, చెంచు గోపి, తానేరు అంకంరాజు, నెలపాటి డానియెల్ ఉన్నారు. వీరంతా ఇక్కడికి వలస వచ్చి వేర్వేరు ప్రాంతాల్లో ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

హర్షితారెడ్డికి ఆశ స్కాలర్‌షిప్

చౌటుప్పల్, జూన్ 6 : మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడేనికి చెందిన బొమ్మిరెడ్డి హర్షితారెడ్డి స్థానిక తెలంగాణ గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతిలో 10జీపీఏ సాధించింది. దాంతో ఆమెకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చౌటుప్పల్ బ్రాంచ్ వారు ఎస్‌బీఐ ఆశ స్కాలర్‌షిప్ కింద రూ.20 వేల నగదును గురువారం అందజేశారు. బ్యాంక్ వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ టాఫర్‌గా నిలిచినందుకు ఈ నగదు ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ సరోజమ్మ అభినందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

చౌటుప్పల్, జూన్ 6 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సరోజమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, ఫిజికల్ సైన్స్, కళాశాలలో గణితం, వృక్ష, జంతు, రసాయన శాస్త్రాలు బోధించేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు పంపించాలని, ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 12లోగా పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి అరెస్ట్

భువనగిరి అర్బన్, జూన్ 6 : బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిని భువనగిరి పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. భువనగిరి పట్టణంలోని ఏరియా దవాఖాన సమీపంలో సాయితేజ ల్యాబ్ నిర్వాహకుడిపై 11 మార్చి 2024న దాడి చేసిన ఘటనలో ఎండీ అరున్, ఎండీ ఖాజా, ఎండీ గఫూర్ అలియాస్ బాబాపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా నిందితులు జైలుకు వెళ్లి కొన్ని రోజుల తర్వాత విడుదలయ్యారు. ఈ క్రమంలో నిందితులు మళ్లీ సాయితేజ ల్యాబ్ వద్దకు వెళ్లి తమపై పెట్టిన కేసు విషయంపై రాజీ పడాలని, కేసుకు సంబంధించిన ఖర్చులను ఇవ్వాలని, ఇవ్వకపోతే సాక్షులతోపాటు సాయితేజ నిర్వాహకుడిని చంపేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. దాంతో ల్యాబ్ నిర్వాహకుడు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఖాజా, అరున్, గఫూర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : ఏడీఏ

రామన్నపేట : విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ దేవ్‌సింగ్

రామన్నపేట, జూన్ 5 : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ దేవ్‌సింగ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంతోపాటు మునిపంపుల, కక్కిరేణి, ఎన్నారం గ్రామాల్లో విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విత్తన ప్యాకెట్లపై వివరాలు లేకపోతే వాటిని అమ్మవద్దని, విత్తనాల స్టాక్, ధరలను స్టాక్‌బోర్డుపై నమోదు చేయాలని షాపుల నిర్వాహకులకు సూచించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలని రైతులకు సూచించారు. విత్తనాలను ఎక్కువ ధరలకు అమ్మితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట వెంట ఏఓ పద్మజ ఉన్నారు.

మోత్కూరు : రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మాలని జిల్లా ఇంటర్నల్ స్క్వాడ్ బృందం సభ్యురాలు పద్మావతి సూచించారు. గురువారం పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల షాపులను స్క్వాడ్ బృందం సభ్యులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన రసీదులు, ఇన్వాయిస్‌లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ స్వప్న, బృందం సభ్యులు దుర్గేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

గుండాల : రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని జిల్లా అంతర్గత స్క్వాడ్ టీం లీడర్, యాదగిరిగుట్ట ఏడీఏ పద్మావతి సూచించారు. గురువారం ఆమె గుండాల ఏఓ లావణ్యతో కలిసి మండల కేంద్రంలోని మహాలక్ష్మి, గ్రోమోర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన రసీదులు, ఇన్‌వాయిస్‌లు, స్టాక్ రిజిస్టర్లు, డెలివరీ చలానాలు, స్టాక్ బోర్డుపై విత్తన ధరలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. వారి వెంట తుర్కపల్లి, బొమ్మలరామారం ఏఓలు దుర్గేశ్వరి, పద్మ ఉన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని పలు విత్తన షాపులను ఏఓ సుజాత పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి

● ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతి



ఎంఈఓ కార్యాలయంలో వినతిత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొమ్మలరామారం, జూన్ 6 : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ధరావత్ జగన్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని, నోటు, పాఠ్య పుస్తకాల ఆమ్మకాలను అడ్డుకోవాలని కోరుతూ మండల విద్యాధికారి కార్యాలయం ఇన్‌చార్జి శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సాయిరాం, కిరణ్, అఖిల్, రాజశేఖర్, ఎమ్మార్పీస్ కార్యాలయ సిబ్బంది ప్రియాంక, జ్యోతి, సరళ పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలను అమలు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

ఆలేరు రూరల్, జూన్ 6 : ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జాప్యం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. గురువారం ఆలేరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొత్తగా వివాహం చేసుకున్న వారికి వెంటనే రేషన్‌కార్డులు మంజూరు చేసి ఇంటిస్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆలేరు మండలంలో ఇసుక మాఫియా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే ఇసుక మాఫియాను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస రాజు, కనకయ్య, పరశురాములు, కిష్టయ్య, ఆంజనేయులు, పూలమ్మ, నాగమణి పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించాలి

● కలెక్టర్‌కు ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య వినతి

కలెక్టర్ హన్మంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేస్తున్న ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆలేరు రూరల్, జూన్ 6 : ఆలేరులోని డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కలెక్టర్ హన్మంతు కె.జెండగేకు ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య గురువారం వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ కాలనీలో మురుగు నీటి పరిష్కారంతోపాటు పట్టణంలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి

● జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ

వావిళ్లపల్లి గ్రామంలో రైతులకు భూసార పరీక్ష కిట్లు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ

సంస్థాన్ నారాయణపురం, జూన్ 6 : ప్రతి రైతు కచ్చితంగా భూసార పరీక్షలు చేయించిన తరువాతే పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ సూచించారు. గురువారం మండలంలోని వావిళ్లపల్లి క్లస్టర్ పరిధిలో షెడ్యుల్ తెగ ఉప ప్రణాళిక పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్ష కిట్లను అందజేసి మాట్లాడారు. నేలలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడు పెట్టుబడులు తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రత్నాకర్, సైంటిస్ట్ అనిల్‌కుమార్, ఏఓ నాగరాజు, ఏఈఓలు నవీన్, అరుణ, శివ, శశిబిందు, స్వప్నిక, ఎంపీటీసీ దోటి జంగయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ఎస్ఐ కొట్టడాని ఆరోపణ

సతీశ్, మత్స్యగిరి

మోత్కూరు, జూన్ 6 : భూమి పంచాయతీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తమను అకారణంగా కొట్టాడని మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన రైతులు ఎలుగు సతీశ్, మత్స్యగిరి ఆరోపించారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ల 52,53,54లో 0.34 గుంటల భూమి తమకు తక్కువగా ఉండటతో పక్క రైతులు వల్లపు నర్సయ్య, మల్లయ్య ట్రాక్టర్‌తో దున్నుతుండగా అడ్డుకొని 100కు కాల్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము ఫిర్యాదు చేసినట్లు రసీదు ఇవ్వమంటే ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కొట్టినట్లు తెలిపారు. అకారణంగా కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయంపై ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. భూమి వివాదంలో గొడవ పడిన ఇరువర్గాలను తాసీల్దార్ ఎదుట బ